


స్టార్ త్రినేత్ర

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 107	ఎడిటర్ : డి.శివకృష్ణ	బుధవారం	04-11-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 107	EDITOR : D.SHIVAKRISHNA	WEDNESDAY	04-11-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts



కొడంగల్‌లో టీఆర్ఎస్ ప్రభం'జనం'

కవిత పార్టీకి పెరుగుతున్న ఆదరణ..

రేవంత్‌కు ప్రత్యామ్నాయంగా రాజప్రభాకర్!

- సీఎం సొంత గడ్డపై కవిత రాజకీయ విస్తరణ
- కొడంగల్‌లో పార్టీ బలోపేతానికి రాజప్రభాకర్ వ్యూహాలు
- పాంచజన్య సభతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- రైతు సమస్యలే అస్త్రంగా రాజప్రభాకర్ అడుగులు
- భూసేకరణ, ఉపాధి అంశాలపై ప్రజల్లో చర్చ
- కవిత ప్రసంగానికి సీఎం.. సీఎం.. నినాదాలు
- రేవంత్ నియోజకవర్గంలో కొత్త రాజకీయ పోటీ



స్టార్‌త్రినేత్రం
- కొడంగల్

కొడంగల్‌లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయా..? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) క్రమంగా పట్టు పెంచుకుంటోందా..? కోస్గిలో కవిత నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభకు లభించిన స్పందన ఈ ప్రశ్నలకు బలం చేకూరుస్తోంది. మరోవైపు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజప్రభాకర్ రావు స్థానిక సమస్యలపై గళమెత్తుతూ ప్రజల్లో గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో కొడంగల్ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయనే చర్చ మొదలైంది.

తెలంగాణ రాజకీయాల్లో కొడంగల్ నియోజకవర్గం మరోసారి హాట్‌టాపిక్‌గా మారుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో రాజకీయంగా కొత్త శక్తులు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'కు లభించిన స్పందన స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సభను విజయవంతం చేయడంలో పార్టీ కొడంగల్ ఇన్‌ఛార్జి రాజప్రభాకర్ రావు కీలక పాత్ర పోషించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

స్థానిక సమస్యలే ప్రధాన అస్త్రం!

స్థానికుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా రాజప్రభాకర్ రావుకు నియోజకవర్గంలో గుర్తింపు ఉందనే ప్రచారం సాగుతోంది. రైతుల ఇబ్బందులు, భూసేకరణ వివాదాలు, సామాన్య ప్రజల సమస్యలపై ఆయన చురుగ్గా స్పందిస్తున్నారు. ప్రజా సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బాధితుల తరపున గళం వినిపిస్తూ రాజకీయంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ముఖ్యంగా కొడంగల్ ప్రాంతంలో స్థానిక ఉపాధి అవకాశాల కల్పన, వలసల నివారణ వంటి అంశాలను తన రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే వాదనతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గంలో బలమైన రాజకీయ ప్రత్యర్థిగా రాజప్రభాకర్ రావు ఎదిగే అవకాశాలున్నాయనే చర్చ స్థానికంగా మొదలైంది.

కవిత ప్రసంగంతో రాజకీయ వేడి!

కోస్గిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించాయి. తాను ఎవరో వదిలిన బాణాన్ని కాదని, బహుజనుల బాణాన్ని ప్రకటించడం ద్వారా తన రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్, ప్రధాని మోదీతోనైనా పోరాడేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే భవిష్యత్తులో ముఖ్యమంత్రి పదవిని కూడా చేపడతానని ధీమాను వ్యక్తం చేశారు.

కవిత ప్రసంగానికి సీఎం నినాదాలు

కవిత ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంగణం సీఎం.. సీఎం.. అనే నినాదాలతో మార్మోగడం రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఈ పరిణామం తెలంగాణ రక్షణ సేన భవిష్యత్తు రాజకీయ ప్రస్థానంపై కొత్త చర్చకు తెరలేపింది. ముఖ్యంగా సీఎం సొంత నియోజకవర్గంలోనే ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఆదరణ లభిస్తోందనే సంకేతాలు కనిపిస్తున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

రైతుల ఆందోళనతో ప్రభుత్వంపై ఒత్తిడి!

మరోవైపు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో రైతుల నుంచి బలవంతపు భూసేకరణ జరుగుతోందనే ఆరోపణలు కొడంగల్ ప్రాంతంలో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో పత్తి రైతులు గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

దౌల్తాబాద్ మండలం నీటూర్ గేటు సమీపంలోని విజయ్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లు ఎదుట రైతులు ధర్నాకు దిగారు. మిల్లు యాజమాన్యం క్వింటాల్ పత్తికి రూ.8,900 నుంచి రూ.9,200 వరకు మాత్రమే చెల్లిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయమైన ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే రైతులు ఆందోళనకు దిగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

రేవంత్‌కు ప్రత్యామ్నాయం దిశగా?

ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు భూసేకరణ వివాదాలు, స్థానిక ఉపాధి అంశాలు కొడంగల్ రాజకీయాల్లో కీలక చర్చలకు కారణమవుతున్నాయి. ఈ అంశాలనే ప్రధాన అజెండాగా చేసుకుని రాజప్రభాకర్ రావు ప్రజల్లోకి వెళ్తుండటం తెలంగాణ రక్షణ సేనకు రాజకీయంగా కలిసివచ్చే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కవిత సభకు వచ్చిన స్పందన, స్థానికంగా రాజప్రభాకర్ రావు చురుకైన రాజకీయ కార్యకలాపాలు పార్టీకి ఎంతవరకు బలాన్ని చేకూరుస్తాయనేది రాబోయే రోజుల్లో తేలనుంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లోనే మరో రాజకీయ ప్రత్యామ్నాయం రూపుదిద్దుకునే ప్రయత్నం జరగడం ఆసక్తికర పరిణామం. ఈ పరిణామాలు భవిష్యత్తులో కొడంగల్ రాజకీయ ముఖచిత్రాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.



స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/2026/A0436
అనుక్షణం అక్షరసత్యం

నిరసన తెలిపే హక్కు ఏ ఒక్కరి సొంతం కాదు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ :



దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలు, ఆందోళనలపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్నాల వల్ల ఎదురవుతున్న సమస్యలపై దాఖలైన పిటిషన్లపై స్పందించిన ధర్మాసనం.. కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాపార సంఘాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే, తమ పిటిషన్‌లో ఆందోళన నిర్వాహకులను కూడా ప్రతివాదులుగా చేర్చాలని వ్యాపార సంఘాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో పౌరుల హక్కులు, వ్యాపారుల ఇబ్బందులపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

సమాజంలో అందరికీ హక్కు..

సమాజంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఈ హక్కు ఏ ఒక్కరికో సొంతం కాదు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సమస్యలపై గళమెత్తే హక్కు అందరిదీ అయినప్పటికీ, నిరసన తెలిపే ప్రాంతాలను నిరవధికంగా ఒక్కరే ఆక్రమించి ఉంచలేరు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇతరుల ఆవేదననూ గుర్తించాల్సిన అవసరం ఉందన్న కోర్టు, ముఖ్యంగా పండుగల వేళ ఇటువంటి సుదీర్ఘ ఆందోళనల వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. హక్కుల పరిరక్షణతో పాటు సాధారణ పౌరులు, వ్యాపారుల ప్రయోజనాలను సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

కేసీఆర్ హయాంలో తెలంగాణ సొత్తును కొల్లగొట్టారు..

మంత్రి పొంగులేటి ధ్వజం



స్టార్ త్రినేత్రం, ఖమ్మం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలి పేదోళ్ల కష్టాలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. వారి స్వార్థానికి, స్వలాభానికి రాష్ట్ర సొత్తును ఆ దొరలు కొల్లగొట్టి, ప్రజలను పేదవాళ్లుగా చేశారని ఆగ్రహించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ తెల్దారుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు.

మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తాం..

పొర్లు దండాలు పెట్టుకుంటూ ప్రతిపక్షాల నేతలు తమ ప్రభుత్వం గురించి విమర్శలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో రైతులు వరి సాగు వేస్తే ఉరే అన్నారని.. తమ ప్రభుత్వం అన్నదాతలు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఆదుకుందని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రతి పేదింటికి సంక్షేమ కార్యక్రమాలను అందజేస్తోందని వెల్లడించారు. తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. మళ్లీ మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా కల్పించారు.

అన్ని గ్రామాల్లో భూసర్వే చేయాలి..

రాష్ట్రంలో 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు. 120 సంవత్సరాల క్రితం భూముల సర్వేలు జరిగాయని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి అంగుళం సర్వే చేసి భూములు ఉన్న వారికి పూర్తి భరోసా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. పాలేరు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో భూసర్వే చేయాలని కలెక్టర్‌ను ఆదేశించామని అన్నారు. మ్యాపులతో కూడిన సర్వేతో ఆధార్ ఎలా ఉందో.. భూదార్ కూడా అలానే ఉండేలా ప్రతి భూస్వామికి ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

అర్హుల ఓట్లు తొలగిస్తే సహించం.. ప్రతి ఓటుకూ లెక్క చెప్పాల్సిందే: మంత్రి ఉత్తమ్ కుమార్

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :



ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ చేపడుతూ అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ప్రతి పేరుకు సంబంధించి స్పష్టమైన కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఓటర్ల పేర్లను తొలగించడం సరికాదని, బాధితులకు తమ అభ్యంతరాలను తెలియజేసేందుకు, వివరణ ఇచ్చేందుకు తగిన అవకాశం కల్పించాలని అన్నారు. పొరపాటున తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం పూర్తి స్పష్టత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ప్రతి చర్యకు సరైన ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడినట్లు తేలితే వాటిని సరిదిద్దే వరకు ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల రక్షణ కోసం ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యత అవసరమని అభిప్రాయపడ్డారు.

రూ.21,800 కోట్ల అభివృద్ధి పనులకు

శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

పుణె :



మహారాష్ట్రలోని పుణె మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన రూ.21,800 కోట్ల విలువైన పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. పుణె మెట్రో మూడో లైన్ (పింక్ లైన్)ను మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దాదాపు 23 కిలోమీటర్ల పొడవైన ఈ మెట్రో మార్గం ద్వారా నగరంలోని ప్రముఖ ఐటీ హబ్ హింజేవాడి నుంచి శివాజీనగర్ వరకు మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. రూ.8,300 కోట్లకు పైగా వ్యయంతో దీనిని నిర్మించారు. కాగా, మాన్ నుంచి డిఫ్టిక్ట్ కోర్టు మెట్రో స్టేషన్ వరకు ఈ కారిడార్ విస్తరించి ఉంది. ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, నిత్యం కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు ఉపయోగపడనుంది.అలాగే, రోడ్డు మార్గంలో ప్రయాణించే వారిపై ఒత్తిడి తగ్గించడంతో పాటు ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మెట్రో లైన్‌లో మరో ప్రత్యేకత కూడా ఉంది. రైళ్లను పూర్తిగా మహిళా రైలు ఆపరేటర్లే నిర్వహించనున్నారు. ఈ మార్గానికి అవసరమైన విద్యుత్‌లో సుమారు 30 శాతాన్ని సౌర విద్యుత్ ద్వారా సమకూర్చాలని ప్రణాళిక రూపొందించారు. ఇదే కార్యక్రమంలో పుణె మెట్రో రెండో దశ విస్తరణ పనులకూ ప్రధాని శంకుస్థాపన చేశారు. సుమారు రూ.13,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు కొత్త మెట్రో కారిడార్లను నిర్మించనున్నారు. ఇందులో 2ూ, 2దీ, 4, 4ూ మార్గాలు ఉన్నాయి. ఈ విస్తరణలో భాగంగా వనాజ్ నుంచి చాందినీ చౌక్, రామ్‌వాడి నుంచి విత్తల్‌వాడి, ఖరాడి నుంచి ఖడక్‌వాస్లా, నాల్స్‌టాప్ నుంచి మాణిక్‌బాగ్ ప్రాంతాలను మెట్రోతో అనుసంధానించనున్నారు. దీంతో ఖరాడి, మగర్‌పట్టా, హడప్సర్, స్వార్గేట్, వార్జే, పుణె కంటోన్మెంట్ వంటి ప్రాంతాలకు మెట్రో సేవలు విస్తరించే అవకాశం ఉంది. కొత్త మార్గాలను ఇప్పటికే ఉన్న మెట్రో నెట్‌వర్క్‌తో పాటు అంతర్‌నగర బస్సు సేవలకు అనుసంధానించనున్నారు. ఇందుకోసం స్వార్గేట్, నాల్స్‌టాప్, ఖరాడి బైపాస్ వద్ద ఇంటర్‌చేంజ్ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా పుణె మెట్రో మూడో లైన్ ప్రారంభం, రెండో దశలో నాలుగు కొత్త కారిడార్లకు శంకుస్థాపనతో నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత విస్తరించనుంది.

చైనా దెబ్బతో అమెరికాలో కోతుల కొరత .. ఫార్మా రంగంలో కొత్త సంక్షోభం!



అంతర్జాతీయం :

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చాక అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఔషధ పరిశోధన రంగంలో ఏఐ అనూహ్యమైన మార్పులు తీసుకువచ్చింది. గతంతో పోలిస్తే ఇప్పుడు ఏఐ సాయంతో కొత్త మందులను వేగంగా గుర్తించే అవకాశం ఏర్పడుతోంది. అయితే ఈ పరిణామం అమెరికా ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు కొత్త సమస్యను తెచ్చిపెడుతోంది. కొత్త ఔషధాలపై ప్రయోగాలు చేసేందుకు అవసరమైన ల్యాబ్ కోతుల కొరత అమెరికాను వేధిస్తోంది. కోతుల దిగుమతులపై ఆంక్షలు, పెరుగుతున్న ధరలు పరిశోధనా సంస్థలకు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలోనే భారీ స్థాయిలో కోతుల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ స్టార్టప్ ముందుకురావడం చర్చనీయాంశం అవుతోంది.

ల్యాబ్‌ల్లో కోతుల ప్రాధాన్యత ఏమిటి?

అమెరికా ల్యాబ్‌లు ఏటా దాదాపు 20 వేల కోతులను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటాయి. ముఖ్యంగా 'మకాక్' రకానికి చెందిన కోతుల జన్యు నిర్మాణం, జీవక్రియలు మానవులతో చాలా పోలి ఉంటాయి. మానవులపై క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించడానికి ముందు ఔషధాల భద్రత, విషపూరితం, ప్రభావం వంటివి తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలు వీటిపైనే ఎక్కువగా ప్రయోగాలు చేస్తుంటారు. అమెరికాకు ల్యాబ్ కోతులను సరఫరా చేయడంలో చైనానే ప్రధాన పాత్ర పోషించేది. దాదాపు 60 శాతం కోతులు చైనా నుంచే దిగుమతి అయ్యేవి. అయితే 2020లో చైనా కోతుల ఎగుమతులపై నిషేధం విధించడంతో అమెరికా ఫార్మా రంగంపై ఒక్కసారిగా దెబ్బ పడింది.

ఒక్కో కోతి ధర రూ. 20 వేల డాలర్లకు పైగా!

చైనా నిషేధం తర్వాత అమెరికా ల్యాబ్‌లు కోతుల కోసం కంబోడియా వైపు దృష్టి సారించాయి. అయితే 2022లో జరిగిన విచారణలో అడవుల్లో పట్టుకున్న అడవి కోతులను పెంచినవిగా చూపి అక్రమంగా విక్రయించినట్లు తేలింది. దీంతో అక్కడి నుంచి కూడా దిగుమతుల తగ్గి, ఆంక్షలు పెరిగాయి. ఓ వైపు ఆంక్షలు, మరో వైపు ల్యాబ్?ల్లో పెరుగుతున్న అవసరాల దృష్ట్యా కోతులకు డిమాండ్ పెరిగిపోయింది. ఈ క్రమంలో ల్యాబ్ ప్రయోగాల్లో ఉపయోగించే మకాక్ కోతుల ధరలు గత కొన్నేళ్లలో భారీగా పెరిగాయి. 2019లో ఒక్కో కోతి ధర సుమారు 3 వేల డాలర్లు ఉండగా.. ప్రస్తుతం 20 వేల డాలర్లకు పైగా చేరినట్లు నివేదిక పెర్కొంటున్నాయి. చైనా నుంచి సరఫరా అయ్యే కోతులకు సుమారు 26 వేల డాలర్ల వరకు ధర పలుకుతున్నట్లు సమాచారం. ఈ పరిణామం ఔషధ పరిశోధన సంస్థలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది.

20 ఏళ్లలో 30 వేల కోతుల పెంపకం లక్ష్యం

ఈ దిగుమతుల సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రముఖ ఐటీ సంస్థ పలాంటిర్ సహ వ్యవస్థాపకుడు జో లోన్స్‌డేల్ మద్దతు ఉన్న 'సేఫర్ హ్యూమన్ మెడిసిన్' అనే స్టార్టప్ రంగంలోకి దిగింది. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు అమెరికాలోనే భారీ స్థాయిలో కోతుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాబోయే 20 ఏళ్లలో దాదాపు 30,000 మకాక్ కోతులను సొంతంగా ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. మొత్తంగా ఏఐ ఎఫెక్ట్ తో కొత్త మందులు వేగంగా వస్తుంటే వాటిని ప్రయోగించి పరీక్షించేందుకు సరిపడ కోతులు అందుబాటులో లేకపోవడం ఫార్మా రంగంలో ఇప్పుడు చర్చగా మారింది.

ఇందిరాగాంధీకి కూడా ఇంకా ఓటు హక్కు ఉంది: కేంద్ర మంత్రి బండి సంజయ్

స్టార్ త్రినేత్రం, నిర్మల్:

భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎప్పుడో మరణించినప్పటికీ, ఆమెకు ఇప్పటికీ ఓటు హక్కు ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే ఓట్ చోరీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. రెండు, మూడు చోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను తొలగించడం తప్పెలా అవుతుందని నిలదీశారు.నిర్మల్‌లో బీజేపీ మహా పాదయాత్రలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ చోరీ అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. సర్ అంటేనే ఓటర్ల జాబితాలో అనర్హుల ఓట్లను తొలగించి, అర్హుల ఓట్లను కొనసాగించడమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ హయాంలోనూ సర్ జరిగిందని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ పాలనలోనూ దీనిని నిర్వహించారని వెల్లడించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీయే సర్ చేపట్టిన విషయాన్ని రాహుల్ మర్చిపోకూడదని ఎద్దేవా చేశారు.ఈ సందర్భంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందినవారు భారత ప్రధానిని నిర్ణయించలేరని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ దేశానికి చెందని వ్యక్తులు, అక్రమంగా చొరబడిన వారి ఓట్లను తప్పకుండా తొలగిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఇలాగే మాట్లాడితే ఎన్ఆర్‌సీ కూడా అమలు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైతే అక్రమంగా దేశంలోకి వలస వచ్చి ఇక్కడే నివసిస్తున్న విదేశీయులను వెనక్కి పంపిస్తామని తేల్చి చెప్పారు. మరోవైపు, సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టబోమని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు.



స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనక్షరం అక్షరసత్యం
తెలుగు దినపత్రిక

బుధవారం 4-11-2026 | పేజీలు : 4 | వెల : 2/-
WEDNESDAY 04-11-2026 | PAGES : 4 | RS : 2/-



కొన్ని విజయాలు చూస్తే ఆనందం కలుగుతుంది.. మరికొన్ని విజయాల వెనుక ఉన్న ప్రయాణం తెలిస్తే మనసు కదిలిపోతుంది. పేదరికమైనా, గ్రామీణ నేపథ్యమైనా, జీవితంలో ఎదురయ్యే బాధ్యతలైనా.. మనసులో బలమైన సంకల్పం ఉంటే విజయానికి అవేవీ అడ్డంకులు కావని నిరూపించింది ఓ బంజారా బిడ్డ. చదువుకోవాలనే తపనను తన బలంగా మార్చుకుని, తల్లిదండ్రుల ఆశయాలను తన లక్ష్యంగా స్వీకరించి, ఒక్కో మెట్టు అధిరోహిస్తూ రెండు విశ్వవిద్యాలయాల్లో బంగారు పతకాలు సాధించింది. వివాహం తర్వాత కూడా చదువును కొనసాగించి, ఉన్నత విద్యను పూర్తి చేయడమే కాకుండా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆమే నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన **'బాదావత్ సాయి చందన'.**

స్టార్ త్రినేత్రం, స్పెషల్ స్టోరీ : చిన్న గ్రామంలో పుట్టిన పెద్ద కల.. చదువుతోనే జీవితాన్ని మార్చుకోవాలనే సంకల్పం! బాదావత్ రాజు నాయక్, బాదావత్ మమత దంపతులకు 2001 సెప్టెంబర్ 28న జన్మించిన సాయి చందన చిన్నతనం నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుంది. ఆర్మూర్‌లోని రాయల్ మెరిటాస్ స్కూల్‌లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసించింది. అనంతరం జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంది. పాఠశాల దశ నుంచే మంచి మార్కులు సాధిస్తూ తన ప్రతిభను చాటుకుంది. 2017లో పదో తరగతి పూర్తి చేసిన సమయంలో అధిక మార్కులు సాధించినందుకు అప్పటి డిప్యూటీ కలెక్టర్ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకుంది. ఆ చిన్న వయసులో అందుకున్న పతకం ఆమెకు కేవలం గుర్తింపు మాత్రమే కాదు.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలనే సంకల్పానికి పునాది అయ్యింది.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..
కూతురి కలలకు కొండంత అండ!

ఒక బిడ్డ విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంత కీలకమో సాయి చందన ప్రయాణం తెలియజేస్తుంది. కూతురు ఉన్నత చదువులు చదవాలనే

మిగతా 4లో...

స్టార్ త్రినేత్ర
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం అక్షరసత్యం
తెలుగు దినపత్రిక

పరిమళించిన చదువుల చందనం

3వ పేజీ తరువాయి..

ఆకాంక్షను గుర్తించిన రాజు నాయక్, మమత దంపతులు ఆమెకు నిరంతరం అండగా నిలిచారు. 2017 నుంచి 2019 వరకు నిజామాబాద్‌లోని కాకతీయ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన చందన, అనంతరం 2019-2020లో నీట్, ఐసీఏఆర్ ప్రవేశ పరీక్షలకు సిద్ధమైంది. తన భవిష్యత్తుకు సరైన దిశను ఎంచుకోవాలనే తపనతో కష్టపడింది. ప్రతి దశలోనూ తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని తనకు లభించిన గొప్ప బలంగా భావిస్తూ ముందుకు సాగింది.

8.79 జీపీఏతో యూనివర్సిటీ టాపర్..
నితిన్ గడ్కరీ చేతుల మీదుగా గోల్డ్ మెడల్!

సాయి చందన విద్యా ప్రయాణంలో 2020 సంవత్సరం మరో కీలక మలుపుగా నిలిచింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో ఉన్న వసంతరావు నాయక్ మరాఠ్వాడా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో చేరింది. 2020 నుంచి 2024 వరకు సాగిన ఈ విద్యాభ్యాసంలో క్రమశిక్షణ, నిరంతర సాధనతో 8.79 జీపీఏ సాధించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఈ అద్భుత ప్రతిభకు గుర్తింపుగా గోల్డ్ మెడల్ అందుకుంది. అప్పటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా బంగారు పతకం స్వీకరించడం ఆమె జీవితంలో మరిచిపోలేని ఘట్టంగా నిలిచింది. పదో తరగతిలో సిల్వర్ మెడల్‌తో మొదలైన ప్రస్థానం.. ఉన్నత విద్యలో యూనివర్సిటీ టాపర్‌గా ఎదిగి గోల్డ్ మెడల్ అందుకునే స్థాయికి చేరడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

పెళ్లి తర్వాత కూడా ఆగని చదువు..
బాధ్యతల మధ్య లక్ష్యం వైపు అడుగులు!

చదువు పూర్తయ్యాక జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. 2024 జూలైలో హైదరాబాద్‌లోని శివశివాణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో పీజీడీఎం (ఎంబీఏ) అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరింది. ఇదే సమయంలో 2024 నవంబర్ 7న మూడు వినయ్ కుమార్‌తో వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. వినయ్ కుమార్ కూడా సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ (ఓస్)గా పనిచేస్తున్నారు. అయితే సాయి చందన కూడా కొత్త జీవితంలోకి అడుగుపెట్టినప్పటికీ తన విద్యా లక్ష్యాన్ని మాత్రం పక్కన పెట్టలేదు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగిస్తూ తనలోని పట్టుదలను మరోసారి చాటుకుంది. వివాహం తర్వాత మహిళల చదువుకు ఆటంకాలు ఎదురవుతాయనే అభిప్రాయాలకు తన ప్రయాణంతో సమాధానం చెప్పింది. కుటుంబ జీవితం, విద్య రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగింది.

రెండోసారి బంగారు పతకం..
డాక్టర్ వెంకట్రామ్ చేతుల మీదుగా ఘన సత్కారం!

2026 ఏప్రిల్‌లో పీజీడీఎం కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన సాయి చందన మరోసారి తన ప్రతిభను నిరూపించింది. ఈ కోర్సులోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. 2026 అక్టోబర్ 31న సీడ్స్ వర్క్ ఇంటర్నేషనల్ సీఈఓ, ఎండీ డాక్టర్ వెంకట్రామ్ వసంత్ వాడ చేతుల మీదుగా రెండో బంగారు పతకాన్ని అందుకుంది. ఒకే విద్యా ప్రయాణంలో రెండు వేర్వేరు విశ్వవిద్యాలయాల్లో గోల్డ్ మెడల్స్ సాధించడం ఆమె కృషికి లభించిన అరుదైన గుర్తింపు. తల్లిదండ్రులు తమ కూతురిని ఉన్నత చదువులు చదివించాలనే ఆశతో వేసిన ప్రతి అడుగుకు ఈ విజయాలు విలువైన ప్రతిఫలంగా నిలిచాయి.

చదువులోనే కాదు.. ఉద్యోగంలోనూ సత్తా చాటిన ప్రతిభ!

విద్యతో సాధించిన విజయాన్ని వృత్తి జీవితంలోనూ కొనసాగిస్తూ సాయి చందన మరో ముందడుగు వేసింది. పీజీ పూర్తయిన వెంటనే గుబ్బా కోల్డ్ స్టోరేజ్ సంస్థ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ ఎంపిక ఇంటర్వ్యూలకు హాజరై ఎంపికైంది. ప్రస్తుతం ఆ సంస్థలో విక్రయాల విభాగంలో పనిచేస్తోంది. ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం ఆమె ప్రతిభకు మరో నిదర్శనం. చదువుతో సంపాదించిన జ్ఞానాన్ని ఉద్యోగ జీవితంలో ఉపయోగించుకుంటూ తన భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకుంటోంది. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినిగా మాత్రమే కాకుండా, వృత్తిపరమైన బాధ్యతలను స్వీకరించిన యువతిగా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

కూతురి చేతిలో బంగారు పతకం..
తల్లిదండ్రుల కళ్లలో ఆనందభాష్పాలు!

ఒకప్పుడు పాఠశాలలో సిల్వర్ మెడల్ అందుకున్న తమ కూతురు, నేడు రెండు విశ్వవిద్యాలయాల్లో గోల్డ్ మెడల్స్ సాధించి ఉద్యోగ జీవితంలోనూ అడుగుపెట్టడం తల్లిదండ్రులకు ఎనలేని ఆనందాన్ని కలిగించే విషయం. బాదావత్ రాజు నాయక్, మమత దంపతులు తమ కూతురిపై ఉంచిన నమ్మకం, ఆమెకు అందించిన ప్రోత్సాహం ఈ విజయాల్లో ప్రతిబింబిస్తున్నాయి. తల్లిదండ్రుల కలలను నిజం చేయడానికి కూతురు పడిన శ్రమ, ఎదురైన ప్రతి సవాలును అధిగమించిన తీరు ఈ కథకు అసలైన అందం.

ఒక బంజారా బిడ్డ విజయం..
వేలాది మంది ఆడపిల్లలకు స్ఫూర్తి!

బాదావత్ సాయి చందన సాధించిన విజయాలు కేవలం రెండు బంగారు పతకాలకే పరిమితం కావు. ఒక బంజారా కుటుంబంలో పుట్టిన అమ్మాయి ఉన్నత విద్యను అభ్యసించి, వివాహం తర్వాత కూడా తన లక్ష్యాన్ని కొనసాగించి, ఉద్యోగ జీవితంలో స్థిరపడుతున్న స్ఫూర్తిదాయక ప్రయాణమిది. బంజారా సమాజంలోని ప్రతి తల్లిదండ్రికి తమ ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలనే ఆలోచనను కలిగించే విజయమిది. ఆడపిల్లలకు అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబానికే కాకుండా సమాజానికి, ప్రాంతానికి, దేశానికి గర్వకారణంగా నిలుస్తారని ఆమె నిరూపించింది.

ఆమె చేతిలో ఉన్నవి రెండు బంగారు పతకాలే కావచ్చు.. కానీ ఆ పతకాల వెనుక తల్లిదండ్రుల ఎన్నో ఆశలు, ఆమె ఎన్నో ఏళ్ల కష్టం, నిద్రలేని రాత్రులు, వదులుకోని లక్ష్యం దాగి ఉన్నాయి. తల్లిదండ్రుల నమ్మకాన్ని విజయంగా మార్చిన బాదావత్ సాయి చందన ప్రస్థానం నిజంగా అభినందనీయం. ఒక ఆడబిడ్డకు చదువు అందిస్తే ఒక కుటుంబమే కాదు.. సమాజం మొత్తం గర్వపడే విజయాలు సాధించగలదని ఆమె కథ మరోసారి చాటిచెబుతోంది.





















5 | వరంగల్ WARANGAL | సంపుటి: 02 VOL : 02 | సంచిక: 107 ISSUE : 107 | స్టార్ త్రినేత్రం అనుక్షణం అక్షరసహస్రం తెలుగు దినపత్రిక PRGI NO: TGTEL/26/A0436 | బుధవారం WEDNESDAY | 04-11-2026 04 - 11- 2026 | పేజీలు: 04 PAGES : 04 | వెల: 2/- PRICE : 2/-

ఘనంగా అభ్యాస ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ప్రెషర్స్ డే, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





స్టార్ త్రినేత్రం, వనస్థలిపురం:

హయత్‌నగర్ లోని ప్రముఖ విద్యాసంస్థ అభ్యాస మహిళా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఎంఈ రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ కామర్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. పాట్రిక్ ఆంథోనీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథి, ప్రిన్సిపాల్, డైరెక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ డాక్టర్ పాట్రిక్ ఆంథోనీ మాట్లాడుతూ... మహిళా విద్యాభివృద్ధే సమాజ సమగ్ర వికాసానికి పునాది అని స్పష్టం చేశారు. పట్టభద్రులైన విద్యార్థినులు ఇక్కడితో ఆగిపోకుండా ఉన్నత చదువులు, పరిశోధనలు, పోటీ పరీక్షల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఆధునిక సాంకేతికత, పోటీ నైపుణ్యాలను నిరంతరం అందిపుచ్చుకుంటూ స్వశక్తితో సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం: ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ పవిరాల మాట్లాడుతూ... విద్యార్థినులకు కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా, నైతిక విలువలతో కూడిన సమగ్ర నాణ్యమైన విద్యను అందించడమే అభ్యాస మహిళా డిగ్రీ కళాశాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా స్వయం సాధికారత సాధించేలా తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో విశేష శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీ సౌకర్యాలతో పాటు నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు నిరంతరం తోడ్పాటునందిస్తున్నామని చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్లే ప్రతి విద్యార్థిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబడి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు:

అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంప్రదాయ క్లాసికల్ నృత్యాలతో ప్రారంభించి, తెలంగాణ జానపద గీతాలు, దేశభక్తి గీతాలు, సినీ గీతాలకు విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. విద్యార్థినుల ఫ్యాషన్ వాక్, బృంద నృత్యాలు, నాటికలు ప్రాంగణంలో సందడి నెలకొల్పగా, తోటి విద్యార్థుల ఈలలు, చప్పట్లతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కె. మల్లేష్, బి. శ్యాంసుందర్ రెడ్డి, ఎల్. సునీత, అధ్యాపకులు లవ కుమార్, ఇబ్రహీం, రాజేష్, స్రవంతి, అశ్విని, బిందు, దివ్య, సునిత, చందన, శ్రీనివాస్ మరియు విద్యార్థినులు,వారితల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం..విశేష స్పందన





స్టార్ త్రినేత్రం, కొడంగల్ :

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని వివిధ మండలాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది.ఇక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువును పొడిగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన విజ్ఞప్తికి ఎన్నికల అధికారులు సానుకూలంగా స్పందించారు. కవిత విజ్ఞప్తి మేరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు దరఖాస్తు గడువు పెంచింది ఎన్నికల సంఘం.కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ నిలిచిపోవడంతో నామినేషన్ల చివరి రోజు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల టీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 2న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువు పొడగించాలని ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డిని కవిత బృందం కలిసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ నవంబర్ 21 వరకు కొనసాగనున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువును కూడా పొడిగించాలని కోరగా ఎన్నికల అధికారులు సానుకూలమైన నిర్ణయం తీసుకున్నారు.



నేడు 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం

బొంగ్లూర్ ప్రమీదా గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం
రోజంతా కాంగ్రెస్ శ్రేణులతో మమేకం కానున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
అభివృద్ధి పనుల సమీక్ష, భవిష్యత్ కార్యాచరణపై చర్చ



స్టార్ త్రినేత్రం, ఇబ్రహీంపట్నం:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో మరింతగా మమేకమయ్యేందుకు, వారి సమస్యలు తెలుసుకునేందుకు స్థానిక శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం' పేరిట భారీ సమావేశానికి శ్రీకారం చుట్టారు. ఇవాళ బొంగ్లూర్ గేట్ సమీపంలోని ప్రమీదా గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ఘనంగా ప్రారంభం కానుంది. రోజంతా జరిగే ఈ సమ్మేళనంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో పూర్తి సమయం గడపనున్నారు.

అభివృద్ధి సమీక్ష.. భవిష్యత్ కార్యాచరణ:

నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ నాయకుడిని, కార్యకర్తను నేరుగా కలిసి వారి కష్టసుఖాలను పంచుకోవడం ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యం. గత మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులతో సమగ్రంగా చర్చించనున్నారు.

పండుగల వేళ ఆత్మీయ కలయిక:

దసరా, దీపావళి పండుగల సందడి నేపథ్యంలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలతో ఆత్మీయంగా గడిపేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు. పార్టీలో ప్రతి ఒక్క కార్యకర్తకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, వారి సలహాలు, సూచనలను ఎమ్మెల్యే స్వీకరించనున్నారు. ఈ సమ్మేళనానికి నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసే కార్యకర్తలు, నాయకుల కోసం ప్రత్యేకంగా విస్తృత భోజన ఏర్పాట్లు పూర్తి చేశారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, ఐక్యతను మరింత చాటేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం దోహదపడుతుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణుల మధ్య పరస్పర అవగాహన, సమన్వయం పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం'ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీకృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అన్నవితరణ

అనాథ, నిరుపేద చిన్నారుల ఆకలి తీర్చిన సేవా సమితి
దాత శివు పటేల్ సహకారంతో 600 మందికి అల్పాహారం, భోజనం





స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

నిరుపేదలకు, అనాథలకు నిరంతరం అండగా నిలుస్తూ 'మానవ సేవే మాధవ సేవ' అన్న నినాదాన్ని చేతల్లో చూపుతోంది శ్రీకృష్ణ గోపాల్ సేవా సమితి. సమాజ హితమే పరమావధిగా సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్న ఈ సంస్థ, మంగళవారం స్థానిక అనాథ మరియు నిరుపేద పిల్లల పాఠశాలలో మరో బృహత్తర అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించింది. సిద్ధిపేటకు చెందిన శివు పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సహకారంతో ఈ భారీ కార్యక్రమాన్ని సేవా సమితి చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు పాఠశాలలోని సుమారు 600 మంది చిన్నారులకు అల్పాహారం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం వేళ 300 మంది చిన్నారులకు రుచికరమైన అల్పాహారాన్ని అందించగా, మధ్యాహ్నం మరో 300 మంది విద్యార్థులకు స్వయంగా వడ్డిస్తూ పౌష్టికాహార భోజనాన్ని అందించారు. అనంతరం చిన్నారుల కోలాహలం మధ్య జన్మదిన కేక్ కట్ చేయించి, పిల్లల ముఖాల్లో చిరునవ్వులు నింపారు. కడుపునిండా భోజనం చేసిన చిన్నారులు సమితి సభ్యులకు, దాత శివు పటేల్ కి చేతులెత్తి కృతజ్ఞతలు తెలుపుతూ జన్మదిన శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. అభాగ్యుల కడుపు నింపడంలోనే అసలైన దైవత్వం ఉందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ శుభకార్యాలు లేదా పెద్దల జ్ఞాపకార్థం చేసే ఖర్చులను ఇలాంటి సేవా మార్గంలోకి మళ్లించాలని కోరారు. ఆడంబరాలకు కాకుండా అనాథ చిన్నారుల ఆకలి తీర్చేందుకు ముందుకొచ్చిన దాత శ్రీ శివు పటేల్ గారి ఔదార్యాన్ని కొనియాడుతూ, ఆయన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. నిరుపేదలకు చేయూతనిచ్చే ఇలాంటి సేవా యజ్ఞాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సంస్థలు తమను 8106876999 నంబరులో సంప్రదించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని శ్రీకృష్ణ గోపాల్ సేవా సమితి నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా చేకూర్తి నవీన్ ఏకగ్రీవ ఎన్నిక

స్టార్ త్రినేత్రం, వేములవాడ :

సమాచార హక్కు చట్టం--2005 అమలు, ప్రజల్లో చట్టంపై అవగాహన కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా చేపట్టిన 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమంలో భాగంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణఅధ్యక్షుడిగా చేకూర్తి నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈనియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లవేని సురేష్‌లకు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నూతనంగా ఎన్నికైన చేకూర్తి నవీన్‌కు జిల్లా అధ్యక్షుడు పులి మధుకర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కమిటీని మరింత బలోపేతం చేస్తూ, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.అదేవిధంగా కమిటీల ఏర్పాటులో చురుకుగా వ్యవహరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్ మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



